మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SATURDAY 28-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 360 Issue: 360

28 జూన్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి చతుర్దశి తె. 3:060 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం జ్యేష్ఠ రా. 1:010 వరకు తరువాత మూల యోగం శుభ మ. 1:20 వరకు కరణం గరజి మ. 1:55 వరకు వనిజ తె. 3:060 వరకు వర్జ్యం తె. 4:28 నుండి ఉ. 6:16 వరకు దుర్ముహూర్తం సా. 5:05 నుండి సా. 5:57 వరకు రాహుకాలం సా. 5:12 నుండి సా. 6:50 వరకు యమగండం మ. 12:19 నుండి మ. 1:57 వరకు గుళికాకాలం మ. 3:34 నుండి సా. 5:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు మ. 3:15 నుండి సా. 5:02 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## ఈ లారీకి 160 టైర్లు..!



భారీ యంత్రాలు, ప్రాజెక్టుల నిర్మాణ పరికరాలు, మిషనరీని తరలించేందుకు కొన్నికొన్ని సార్లు ప్రత్యేకంగా భారీ వాహనాలను నిర్మించాల్సి వస్తుంది. భారీ సంఖ్యలో టైర్లు (చక్రాలు) ఉండే వాహనాలను సాధారణంగా భారీ రవాణా వాహనాలు లేదా మల్టీ-యాక్సిల్ ట్రక్కులు అంటారు. అలాంటి ట్రక్ ఒకటి వైరల్ గా నిలిచింది.

జుక్కల్, జూన్ 27 (ఈవార్తలు): తాజాగా జుక్కల్ చౌరస్తా మీదుగా 161వ జాతీయ రహదారిపై 160 చక్రాల భారీ వాహనం వెళ్లడం అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్ నుంచి గుజరాత్‌కు భారీ విద్యుత్తు యంత్రాన్ని తరలిస్తున్న ఈ వాహనం అక్కడికి చేరడానికి మరో

## ఈ రైలుతో కాలుష్యం రాదు..!



భారతీయ రైల్వే మరో చారిత్రాత్మక అడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ రైలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పర్యావరణహిత, కాలుష్య రహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించే దిశగా ఈ రైలును అందుబాటులోకి తీసుకొస్తోంది.

న్యూఢిల్లీ: ఈ హైడ్రోజన్ రైలు హర్యానాలోని జింద్–సోనిపట్ రైల్వే మార్గంలో నడవనుంది. బ్రాడ్ గేజ్ నెట్‌వర్క్ పై నడిచే ప్రపంచంలోనే అత్యంత పొడవైన, అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఇది ఒకటిగా గుర్తింపు తెచ్చుకోనుంది. ఈ- 2 వ పేజీలో...

## వారం పాటు వాన వరాలు!

**రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు**

**ఉత్తర, తూర్పు తెలంగాణలో అతి భారీ**

**హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి**



హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో -2 వ పేజీలో...

# స్లాబ్ సైజు పెరగొద్దు!

### 500-750 చదరపు అడుగులే ఉండాలి

### ముందువైపు 3 అడుగులు, మిగతా వైపు 1 అడుగే

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఆంక్షలు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్‌ను 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. స్లాబ్ ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ముందువైపు మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్క అడుగుకు మించరాదని స్పష్టం చేశారు.

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): కొత్తగా చేపట్టే నిర్మాణాలతో పాటు, ప్రస్తుతం బేస్‌మెంట్ లేదా రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. చాలామంది లబ్ధిదారులు అవసరానికి మించి పెద్ద సైజులో స్లాబులు వేస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరుగుతోందని గృహ నిర్మాణ సంస్థ గుర్తించింది. గోడల నుంచి ఎనిమిది అడుగుల వరకు కూడా స్లాబులను పొడిగిస్తున్న సందర్భాలు ఉన్నాయని, దీనివల్ల పేద లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ పరిమితులు విధించింది. ఎండ, తరువాయి 2 వ పేజీలో...



## ఇల్లు లేటుగా కట్టిస్తే పరిహారం కట్టాల్సిందే!

### ఇల్లు అప్పగించినా నష్టపరిహారం చెల్లించాల్సిందే

**ఇల్లు చేతికి వచ్చిన తర్వాత కూడా ఈ హక్కు.. సుప్రీం కోర్టు తీర్పు**

గృహ కొనుగోలుదారుల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఫ్లాట్ నిర్మాణంలో జాప్యం జరిగినప్పుడు, దానిని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బిల్డర్ నుంచి నష్టపరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని స్పష్టం చేసింది. కేవలం ఫ్లాట్‌ను స్వీకరించినంత మాత్రాన, ఆలస్యానికి సంబంధించిన నష్టపరిహారం పొందే హక్కు రద్దు కాదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేసింది.

న్యూఢిల్లీ: జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసును పునర్విచారణకు స్వీకరించింది. "నిర్మాణ జాప్యానికి సంబంధించిన నష్టపరిహారం అనేది ఫ్లాట్ అప్పగించడానికి ముందు కాలానికి వర్తిస్తుంది. కేవలం ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన, ఆ జాప్యానికి పరిహారం కోరే హక్కును కొనుగోలుదారులు కోల్పోరు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీకి చెందిన టి.కె.ఎ. పద్మనాభన్ అనే వ్యక్తి, అభియాన్ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీపై 2005లో దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. ఫ్లాట్ అప్పగింతలో తీవ్ర జాప్యం జరిగిందని ఆయన తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,433 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,983 |



# తాగు.. గాల్లో ఊగు!

### ఏపీలో ఎయిర్‌పోర్టుల్లో మద్యం అమ్మకాలు.. 24 గంటలూ బార్లు, వైన్స్ ఓపెన్

### రేణిగుంటకు మినహాయింపు.. ఏపీ సర్కారు కొత్త గైడ్‌లైన్స్ జారీ

ఏపీలో ఉన్న విమానాశ్రయాల్లో మద్యం అమ్మకాలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విమానాశ్రయాల్లో వైన్ షాపులు, బార్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిర్ణయం నుంచి తిరుపతి విమానాశ్రయానికి (రేణిగుంట) మినహాయింపు ఇచ్చారు. తిరుపతి విమానాశ్రయం తప్ప రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల్లోనూ లిక్కర్ విక్రయాలకు పర్మిషన్ ఇచ్చింది.

విజయవాడ, జూన్ 27 (ఈవార్తలు): ప్రభుత్వ నిర్ణయంతో ఏపీలోని ఎయిర్‌పోర్టులలో 24 గంటల పాటు బార్లు, వైన్ షాపులలో మద్యం అందుబాటులో ఉండనుంది. -2 వ పేజీలో...



## 'మేడిన్ ఆంధ్ర' బంగారం

### కర్నూలులో అమ్మకాలు ప్రారంభం

### జొన్నగిరి గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభం

### ఏపీ మ్యాప్, 999 స్వచ్ఛత ముద్రతో బిస్కెట్లు

ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నిజమైంది. రాష్ట్రంలోనే వెలికితీసిన 'మేడిన్ ఆంధ్ర' బంగారం ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గనుల నుంచి జియో మైసూర్ సంస్థ ఉత్పత్తి చేసిన బంగారు బిస్కెట్లను అమ్మకానికి ఉంచారు. ఈ చారిత్రక ఘట్టంతో కర్నూలు జిల్లా పేరు దేశవ్యాప్తంగా మరోసారి మార్మోగుతోంది.

కర్నూలు, జూన్ 27 (ఈవార్తలు): ప్రస్తుతం 50 గ్రాములు, 100 గ్రాములు, 500 గ్రాముల బిస్కెట్ల రూపంలో ఈ బంగారాన్ని విక్రయిస్తున్నారు. ఈ బిస్కెట్లపై ఏపీ మ్యాప్‌తో పాటుగా 'జొన్నగిరి గోల్డ్‌మైన్స్' అనే పేరును ముద్రించారు. బంగారం స్వచ్ఛతను తెలియజేసేలా '999' నంబర్‌ను కూడా వేశారు. ఇది 24 క్యారెట్ల అత్యంత స్వచ్ఛమైన బంగారమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం 500 గ్రాముల బిస్కెట్ విలువ సుమారు రూ.75 తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



వెనెజువెలాలో సంభవించిన రెండు భారీ భూకంపాలు దేశంలోని పలు ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ ప్రకృతి విపత్తు కారణంగా 50 వేల మందికిపైగా గల్లంతైనట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం, ఇప్పటివరకు 900 మందికిపైగా మృతిచెందగా, వేలాది మంది గాయపడ్డారు. కూలిపోయిన భవనాల శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. గల్లంతైన తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం బంధువులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు.

## 15 నుంచి కొత్త ఈహెచ్‌ఎస్

**ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు గుడ్ న్యూస్**

**దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్**

**త్వరలో ఆస్పత్రుల జాబితా, ప్యాకేజీ రేట్ల ప్రకటన**



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది.

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల తరువాయి 2 వ పేజీలో...

# ఆపరేషన్ టైగర్ 3.0

### షిండేవైపు 14 మంది ఎమ్మెల్యేలు.. ఉద్ధవ్ వర్గానికి మరో ఎదురుదెబ్బ?



ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో మరో భారీ కుదుపురాబోతున్నట్లు తెలుస్తోంది. ఉద్ధవ్ వర్గానికి చెందిన కొందరు శివసేన ఎమ్మెల్యేలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీన్ని ఆపరేషన్ టైగర్ 3.0గా అభివర్ణిస్తున్నారు షిండే వర్గపు నేతలు. తాజాగా షిండే వర్గంలోని శివసేనకు చెందిన మంత్రి గులాబ్‌రావ్ పాటిల్ దీనిపై శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఆపరేషన్ టైగర్ 3.0 ప్రారంభమైందన్నారు. దీనిలో భాగంగా ఉద్ధవ్ వర్గానికి చెందిన 14 మంది ఎమ్మెల్యేలు త్వరలో డిప్యూటీ -2 వ పేజీలో...



## వణికిన అఫ్ఘాన్ భారీ భూకంపం

### రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రత

**పాక్, ఉత్తర భారత్‌లోనూ ప్రకంపనలు**

న్యూఢిల్లీ: ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో శనివారం రాత్రి శక్తివంతమైన భూప్రకంపనలు సంభవించాయి. జమ్మూ కాశ్మీర్, తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

28.6.2026

మేషం: ప్రముఖుల నుంచి కీలక సమాచారం సేకరిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. స్థిరాస్తి క్రయ విక్రయాల్లో లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో కార్యజయం కలుగుతుంది. వ్యాపార విస్తరణకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో అనుకున్న లక్ష్యాలు నెరవేరతాయి.

వృషభం: చేపట్టిన పనుల్లో కొంత జాప్యం తప్పదు. ఆర్థిక విషయాలు నిరాశ పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో పరిస్థితులు అనుకూలించవు. ఇంటా బయట యుక్తిగా వ్యవహరించడం మంచిది. ఆరోగ్య విషయాలలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఆదాయ వ్యయాలు సమానంగా ఉంటాయి. అనుకోని ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

కర్కాటకం: కుటుంబ విషయాలలో సొంత ఆలోచనలు అమలు చేస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది.

సింహం: ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ముఖ్యమైన పనులలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వ్యాపార, ఉద్యోగాలు గందరగోళంగా ఉంటాయి.

కన్య: ఆదాయ మార్గాలు పెరిగి రుణాలు తీర్చగలుగుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాల ప్రస్తావన వస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు.

తుల: ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. మిత్రుల నుంచి రుణాల ఒత్తిడులు పెరుగుతాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగాలలో సమస్యల నుంచి బయటపడగలుగుతారు.

ధనస్సు: సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. బంధు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి విషయాలు గుర్తుకు వస్తాయి. పనులు చకచకా పూర్తి చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి.

మకరం: కీలక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. భూసంబంధిత వివాదాలు పరిష్కారమవుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆశించిన ఆదాయం ఉన్నప్పటికీ ఖర్చులు కూడా సమానంగా ఉంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి.

కుంభం: ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి ఉండదు.

మీనం: దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు పుంజుకుంటాయి. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. పలుకుబడి కలిగిన వారి పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

# ‘మేడిన్ ఆంధ్ర’ బంగారం

మొదటి పేజీ తరువాయి

లక్షలకు పైనే ఉంటుందని అంచనా. ప్రస్తుతం కర్నూలులోని షరాఫ్ బజార్లో కొందరు వ్యాపారుల వద్ద ఈ బంగారు బిస్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 24న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జియో మైసూర్–జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలోనే జొన్నగిరి గనుల్లో ఉత్పత్తి అయిన తొలి బంగారాన్ని కర్నూలుకు చెందిన ప్రముఖ బంగారం వ్యాపారులు కామిశెట్టి జగదీశ్, చక్రవర్తి, శ్రీహరిమూర్తి తదితరులు కొనుగోలు చేశారు. సీఎం చేతుల మీదుగా స్వయంగా ‘మేడిన్ ఆంధ్ర’ బంగారం అందుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. వీరిలో ఓ వ్యాపారి ఇప్పటికే ఒక గోల్డ్ బిస్కెట్‌ను వినియోగదారుడికి విక్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతం జొన్నగిరి గనుల నుంచి తొలి విడతగా 100 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేసి విక్రయించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మేడిన్ ఆంధ్ర బంగారం కొనుగోలుకు చాలామంది ఆసక్తి చూపుతున్నప్పటికీ, ప్రస్తుతానికి ఇది పరిమితంగానే మార్కెట్లో ఉంది. త్వరలోనే పూర్తిస్థాయిలో వినియోగదారులందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని ఉత్పత్తి సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. జొన్నగిరిలో బంగారం ఉత్పత్తి ప్రారంభం కావడం వల్ల విదేశాల నుంచి దిగుమతులు తగ్గుతాయని, తద్వారా మన విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఈ బంగారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పన్ను రాయితీలు ప్రస్తుతానికి లేవని స్పష్టమైంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారానికి వర్తించే అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి ఈ బిస్కెట్లను విక్రయిస్తున్నారు. ఇక, కర్నూలులో ఒక జ్యువెలరీ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ముందుకు వస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే, వేలాది మంది స్థానిక స్వర్ణకారులకు, ఇతర కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.





## స్లాబ్ సైజు పెరగొద్దు!

మొదటి పేజీ తరువాయి

వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది.

## ఇల్లు లేటుగా కట్టిస్తే పరిహారం కట్టాల్సిందే!

మొదటి పేజీ తరువాయి

వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. అయితే, ఒప్పందంలోని ఆర్బిట్రేషన్ క్లాజ్‌ను ప్రాతిపదికగా తీసుకుని కింది కోర్టులు ఈ కేసును మధ్యవర్తిత్వానికి పంపాయి. ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వినియోగదారుల రక్షణ చట్టం–1986 అనేది ప్రైవేట్ ఆర్బిట్రేషన్ నిబంధనలకు అతీతంగా వినియోగదారులకు అదనపు రక్షణ కల్పిస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసును ఏడాదిలోగా పరిష్కరించాలని ద్వారక జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## వణికిన అఫ్గాన్ భారీ భూకంపం

మొదటి పేజీ తరువాయి

పంజాబ్, హర్యానా పరిసర ప్రాంతాల్లో భూమి ఒక్కసారిగా కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. జాతీయ భూకంప విజ్ఞాన కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ భూకంప కేంద్రం అఫ్గానిస్తాన్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆఫ్గానిస్తాన్‌లోని హిందూ కుష్ పర్వత ప్రాంతాల్లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.2గా నమోదైంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7.04 గంటలకు భూమికి 215 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. ఈ భూకంపం ధాటికి పాకిస్తాన్‌తో పాటు భారత వాయవ్య ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. భూకంపం చాలా లోతులో సంభవించడంతో దీని ప్రభావం చుట్టుపక్కల చాలా దేశాల్లో కనిపించింది. కాగా, ఒక్కసారిగా భూమి కంపించడంతో దేశ రాజధాని ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఇళ్లు, ఆఫీసుల్లోని వస్తువులు కదలడంతో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు కంగారుపడ్డారు. నివాసితులు, కార్యాలయ ఉద్యోగులు తమ భవనాల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. భూకంప కేంద్రం చాలా లోతులో ఉండటం వల్ల ఉత్తర భారత దేశవ్యాప్తంగా ఈ ప్రకంపనలు స్పష్టంగా తెలిశాయి.

# ఆపరేషన్ టైగర్ 3.0

మొదటి పేజీ తరువాయి

సీఎం షిండే వర్గంలో చేరుతారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉద్ధవ్ వర్గానికి చెందిన శివసేన పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల ఎమ్మెల్యేలు ఇతర పార్టీలో విలీనం కావొచ్చు. దీని ప్రకారం 20 మందిలో 14 మంది ఎమ్మెల్యేలు షిండే వర్గంలో చేరితే విలీనం పూర్తవుతుంది. వారికి ఫిరాయింపుల చట్టం వర్తించదు. ఇదే జరిగితే ఉద్ధవ్ శివసేనకు భారీ ఎదురుదెబ్బ తప్పదు. ప్రస్తుతం ఉద్ధవ్ శివసేన.. శరద్‌చంద్ర పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి మహా వికాస్ అఘాడి (ఎంవీయే) కూటమిగా ఉన్నాయి. ఈ కూటమికి 60 మంది ఎమ్మెల్యేలున్నారు. ఇటీవల ఎంవీయే సమావేశం జరిగింది. అయితే, సమావేశానికి 23 మంది ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. 37 మంది మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. దీంతో వీరంతా షిండే వర్గంలో చేరుతారనే ప్రచారం మొదలైంది. ఇటీవలే ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు షిండే వర్గంలో చేరారు. ఇటు ఎంపీలు, అటు ఎమ్మెల్యేలు వరుసగా పార్టీని వీడితే ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అయితే, తామంతా ఐక్యంగా ఉన్నామని, పార్టీలో, కూటమిలో ఎలాంటి విభేధాలు లేవని నేతలు అంటున్నారు.

## 15 నుంచి కొత్త ఈహెచ్‌ఎస్

మొదటి పేజీ తరువాయి

యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్‌ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా ‘ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్’ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.

## ఈ లారీకి 160 టైర్లు..!

మొదటి పేజీ తరువాయి

రెండు నెలలు పడుతుందని డ్రైవర్ తెలిపాడు. భారీ పరిమాణంలో ఉన్న యంత్రాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మల్టీ-యాక్సిల్ ట్రైలర్‌ను వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాహనం వెళ్లే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు, సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. గతంలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రం మీదుగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై సుమారు 150 టైర్లు కలిగిన భారీ లారీ చూపరులను ఆకట్టుకుంది. అప్పట్లో ఆ లారీ మహారాష్ట్ర నుంచి వైజాగ్ కు మిషనరీ యంత్రాలను తరలించేందుకు ఉపయోగించారు.

## ఈ రైలుతో కాలుష్యం రాదు..!

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్ట్ తో హైడ్రోజన్ ఆధారిత రైల్వే టెక్నాలజీ కలిగిన జర్మనీ, జపాన్, చైనా, అమెరికా లాంటి దేశాల సరసన భారత్ కూడా చేరింది. ఈ రైలులో మొత్తం పది కోచ్‌లు ఉంటాయి. ఇందులో రెండు పవర్ కార్లు, ఎనిమిది ప్రయాణికుల కోచ్‌లు ఉంటాయి. ఈ రైలు 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సిస్టమ్ తో పనిచేస్తుంది. రెండు పవర్ కార్లు కలిసి మొత్తం 2,400 కిలోవాట్ల శక్తిని ఉత్పత్తి చేస్తాయి. సాధారణ ప్రయాణ సమయంలో ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. అయితే, ట్రయల్ రన్‌లలో గంటకు 120 కిలోమీటర్ల వరకు వేగాన్ని పరీక్షించారు. ఒక్కసారి హైడ్రోజన్ నింపితే ఈ రైలు దాదాపు 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

## వారం పాటు వాన వరాలు!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా వర్షసూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు ‘ఆరెంజ్ అలర్ట్’ జారీచేసింది. జూలై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది.



# తాగు.. గాల్లో ఊగు!

మొదటి పేజీ తరువాయి

అలాగే విమానాశ్రయాల్లో బార్లు, వైన్ షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజులు, పన్నులపైనా కొత్త గైడ్ లైన్స్ జారీ చేసింది. తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎయిర్‌పోర్టులలో బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు ఫీజును రూ.5 లక్షలుగా నిర్ణయించారు. మద్యం షాపుల దరఖాస్తు ఫీజు రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. అలాగే విమానాశ్రయాల్లో వైన్ షాపు ఎక్సైజ్ ట్యాక్స్ రూ.2 కోట్లుగా నిర్ణయించారు. 20 లక్షల సర్క్యులేషన్ దాటిన విమానాశ్రయాల్లోని బార్లకు రూ.25 లక్షల ఎక్సైజ్ ట్యాక్స్, సర్క్యులేషన్ 20 లక్షల లోపు ఉంటే ఎక్సైజ్ ట్యాక్స్ రూ.15 లక్షలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. మూడు సంవత్సరాల తర్వాత ఎక్సైజ్ విధానంపై సమీక్షిస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మరోవైపు ఎయిర్‌పోర్టులలో లిక్కర్ అమ్మకాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే విమాన ప్రయాణికుల కోసం ఎయిర్‌పోర్టు టెర్మినళ్లలో బార్లు, లాంజ్స్, డ్యూటీ ఫ్రీ షాపులు ఉంటాయి. వీటి ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులలో పన్ను మినహాయింపులతో డ్యూటీ ఫ్రీ స్టోర్స్ నడుపుతుంటారు. ఈ డ్యూటీ ఫ్రీ షాపులలో వైన్, విస్కీ, ఖరీదైన బ్రాండ్లు అందుబాటులో ఉంటాయి. ఇక ప్రయాణికులు తాగడానికి వీలుగా విమానాశ్రయం లోపల బార్లు, లాంజ్స్ ఏర్పాటు చేస్తారు. వీటిని ఏర్పాటు చేయాలంటే లైసెన్స్, అనుమతి తప్పనిసరి. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం తాజాగా విమానాశ్రయాల్లో మద్యం అమ్మకాలకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది.



# రాష్ట్రంలో 'రాహుల్' బంధు

## 'సర్'ను సీరియస్‌గా తీసుకోండి.. ఆర్ఎస్పీ భద్రత తగ్గించడం కక్షసాధింపే.. బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, మాజీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రభుత్వం భద్రతను తగ్గించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 సంవత్సరాల పాటు ఐపిఎస్ అధికారిగా దేశానికి, సుమారు దశాబ్దం పాటు గురుకుల విద్యా సంస్థల ద్వారా పేద విద్యార్థులకు ఎన్నో సేవలందించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత తగ్గించడం పూర్తిగా కక్షసాధింపు చర్యేనని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై హత్యాయత్నాలు జరిగాయని, తన ప్రాణాలకు ముప్పు ఉందని ఆయన స్వయంగా వెల్లడించినప్పటికీ కావాలనే భద్రతను తగ్గించడం వెనుక కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. గురుకుల విద్యా వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం ప్రశ్నించడం, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిత్రుడు, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడికి సంబంధించిన పోక్సో కేసులో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బలంగా స్పందించడం కూడా ఒక కక్షసాధింపు చర్యకు కారణమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలను విరమించి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రతను వెంటనే పునరుద్ధరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఎలాంటి అపాయం జరిగినా దానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని కేటీఆర్ హెచ్చరించారు.

### వచ్చే ఎన్నికల్లో కారుదే గెలుపు

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

## మా టార్గెట్ తెలంగాణ

**హైదరాబాద్ నుంచే విజయానికి నాంది**

**టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు**

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయధంకా మోగించడమే బీజేపీ నెక్ట్స్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.

## మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ అధికారి బి. అజిత్ రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు ఈ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అజిత్ రెడ్డి పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని 'ఇన్వెస్ట్ తెలంగాణ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ (ఐడీఈఎస్) అధికారి అయిన అజిత్ రెడ్డికి, రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఈ కొత్త బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నగరంలో పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే క్రమంలో ఈ నియామకం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం సర్ఫరాజ్ అహ్మద్ హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమై మెట్రో రైలు విస్తరణపై చర్చించారు. మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ ప్రణాళికల కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ (ఎస్‌బీఐక్యాప్స్)ను కన్సల్టెంట్‌గా నియమించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

## ముగ్గురు సీఎంల ముచ్చటేంది?

**ఉత్తమ్ లేకుండా ఒప్పందాలా?.. మాజీమంత్రి హరీశ్ ధ్వజం**

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్‌డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు. "మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

## ఒవైసీ.. కాస్త చదువుకో: కిషన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒవైసీ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు

# ఆర్టీసీ కార్మికుల హామీలు తీరుస్తం

**రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో తనతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సీఎస్ రామకృష్ణారావుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడీల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందన్నారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను, కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు.

త్వరలో గుర్తింపు సంఘం ఎన్నికలు

విలీన కమిటీలో భాగస్వామ్యం కావాల్సిన కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.



# 200 కోట్లతో భద్రాచలం పనులు ప్రారంభం

## భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే వెంకట్రావు, కలెక్టర్ అంకిత్

భద్రాచలం, జూన్ 27 (ఈవార్తలు): ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## నాకేం జరిగినా రేవంత్‌దే బాధ్యత

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం తన సెక్యూరిటీని తొలగించిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భవిష్యత్తులో తనకు ఏదైనా హాని జరిగితే దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రవీణ్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను లక్ష్యంగా చేసుకుందని అన్నారు. విపక్ష నేతగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఒక మాజీ ఉన్నతాధికారిగా, ప్రజానేతగా ఉన్న తనకు రక్షణ లేకుండా చేయడం వెనుక ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. తాను చేసే ప్రతి పోరాటం ప్రజల కోసమేనని, అందులో ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదని ప్రవీణ్ కుమార్ చెప్పారు. భద్రత తొలగించినంత మాత్రాన తాను భయపడబోనని తెలిపారు. ప్రజల తరఫున మరింత బలంగా గొంతెత్తుతానని స్పష్టం చేశారు.

## నేడు పల్స్ పోలియో కార్యక్రమం

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): పోలియో మహమ్మారి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివారం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాయి. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా పుట్టిన బిడ్డ నుండి 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ పోలియో డ్రాప్స్ ను ఉచితంగా అందించనున్నారు. దేశంలో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించడంలో ఈ పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు ప్రభుత్వం అన్ని రకాల భారీ ఏర్పాట్లను పూర్తి చేసింది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో ప్రత్యేక పోలియో బూత్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, ఏ ఒక్క పసిబిడ్డ కూడా మిస్ అవ్వకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు నేరుగా ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

**సందేహాలకు 94404 55811**
**నంబర్‌ను సంప్రదించవచ్చు.**

## వాట్సాప్ నుంచి తీసేశారని కేసు

బంజారాహిల్స్-హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారని, మళ్లీ అందులో చేర్పించాలంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించిన ఘటన హైదరాబాద్‌లోచోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 పరిధిలోని ఎన్‌బీటీ నగర్ నివాసితుల కోసం స్థానికంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. కాలనీలోని పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యలపై చర్చించుకోవడానికి, పరిష్కార మార్గాలు కనుగొనడానికి ఈ గ్రూప్‌ను వేదికగా చేసుకున్నారు. అయితే, కొద్దికాలంగా కొందరు సభ్యులు గ్రూప్ అసలు ఉద్దేశాన్ని పక్కనపెట్టి రాజకీయ పార్టీలకు సంబంధించిన సందేశాలు, వీడియోలు, ఫొటోలు విపరీతంగా పోస్ట్ చేయడం ప్రారంభించారు. దీంతో గ్రూప్ అడ్మిన్ జోక్యం చేసుకుని, ఇది రాజకీయ ప్రచార వేదిక కాదని, కేవలం బస్తీ సమస్యల కోసమేనని సభ్యులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. గ్రూప్‌లో ఎలాంటి రాజకీయ పోస్టులు పెట్టవద్దని నియమాలను గుర్తుచేశారు. అయినప్పటికీ ఓ మహిళా సభ్యురాలు ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా వరుసగా రాజకీయ సందేశాలను పోస్ట్ చేస్తూనే ఉన్నారు. అడ్మిన్ పలుమార్లు వారించినా ఆమె తన వైఖరి మార్చుకోలేదు. దీంతో విసిగిపోయిన అడ్మిన్, గ్రూప్ నియమావళిని ఉల్లంఘించినందుకు ఆమెను ఆ వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారు. దీనిని అవమానంగా తీసుకున్న సదరు మహిళ, తనను తిరిగి గ్రూప్‌లో చేర్చుకోవాలని అడ్మిన్‌ను పలుమార్లు కోరారు. అయితే, గ్రూప్ నిబంధనలు పాటించని వారిని చేర్చుకోలేమని అడ్మిన్ నిరాకరించారు. దీంతో ఆమె ఆగ్రహం చెంది, అడ్మిన్ తనను ఉద్దేశపూర్వకంగా గ్రూప్ నుంచి తీసేసి మానసికంగా వేధిస్తున్నాడంటూ నేరుగా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సైతం ఆశ్చర్యపోయారు. అయినప్పటికీ, తప్పని పరిస్థితుల్లో గ్రూప్ అడ్మిన్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, అడ్మిన్ మాత్రం తన నిర్ణయానికే కట్టుబడ్డారు. గ్రూప్ నియమాలను పదేపదే ఉల్లంఘించినందువల్లే ఆమెను తొలగించానని, ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి గ్రూప్‌లో చేర్చుకునే ప్రసక్తే లేదని పోలీసుల ఎదుటే తేల్చి చెప్పారు. దీంతో ఈ వింత కేసును ఎలా పరిష్కరించాలో తెలియక బంజారాహిల్స్ పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. సాధారణంగా నేరపూరిత ఫిర్యాదులు స్వీకరించే తాము, ఈ వాట్సాప్ గొడవను ఎలా పరిష్కరించాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు.

## నేడు తెలంగాణకు నితిన్ నబిన్

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఇప్పటికే పార్టీ రాష్ట్ర నేతలు పర్యటనకు సంబందించిన ఏర్పాటు చేశారు. ఆయన అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారి మున్సిపల్ ఎన్నికల వేళ మహబూబ్‌నగర్ వచ్చారు. అక్కడ నుంచి నేరుగా ఢిల్లీ వెళ్లారు తప్ప హైదరాబాద్‌లో అడుగు పెట్టలేదు. రెండవ సారి చేసే పర్యటనలో ఒక రోజంతా గ్రేటర్‌నగరంలో గడపనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి చేరుకుని 4 గంటలకు రంగారెడ్డి జిల్లా కార్యాలయం చేరుకుని అక్కడ నుండి రాష్ట్రంలోని దాదాపు 9 జిల్లాల నూతన పార్టీ కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. సాయంత్రం 5 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ చేరుకుని 6.50 గంటల వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని బూత్ అధ్యక్షులతో భేటీ అవుతారు. తరువాత రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తారు.



# హీరో ప్యాషన్ ప్లస్ కొత్త వేరియంట్

న్యూఢిల్లీ: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్, దేశీయ మార్కెట్లో తన ప్రాచుర్యం పొందిన ఎంట్రీ-లెవల్ కమ్యూటర్ మోటార్‌సైకిల్ ప్యాషన్ ప్లస్‌లో సరికొత్త వేరియంట్‌ను విడుదల చేసింది. 'ప్యాషన్ ప్లస్ డిస్క్' పేరుతో వచ్చిన ఈ కొత్త మోడల్‌ను భద్రత, ఆధునిక ఫీచర్లను కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని తీసుకొచ్చారు. దీని ఎక్స్-షోరూమ్ ధరను (ఢిల్లీ) రూ. 84,128గా కంపెనీ నిర్ణయించింది. ఈ కొత్త వేరియంట్‌లో అత్యంత ముఖ్యమైన మార్పు ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌ను అమర్చడం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రమ్ బ్రేక్ వెర్షన్‌తో పోలిస్తే, డిస్క్ బ్రేక్ మెరుగైన బ్రేకింగ్ పనితీరును, నియంత్రణను అందిస్తుంది. ముఖ్యంగా నగరాల్లోని రద్దీ ట్రాఫిక్‌లో ఆకస్మికంగా బ్రేకులు వేయాల్సి వచ్చినప్పుడు ఇది రైడర్ భద్రతను గణనీయంగా పెంచుతుంది. ఈ అప్‌గ్రేడ్‌తో కమ్యూటర్ విభాగంలో భద్రతకు హీరో ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# కొత్త రంగుల్లో టీవీఎస్ ఎన్‌టార్క్ 125



న్యూఢిల్లీ: ప్రముఖ టూవీలర్ల తయారీ సంస్థ టీవీఎస్ మోటార్, రాబోయే వినాయక చవితి, దసరా పండగ సీజన్‌లను దృష్టిలో ఉంచుకుని తన పాపులర్ స్కూటర్ ఎన్‌టార్క్ 125 లైనప్‌ను రిఫ్రెష్ చేసింది. డిస్క్, రేస్ ఎడిషన్ వేరియంట్లలో సరికొత్త రంగులు, ఆకర్షణీయమైన గ్రాఫిక్స్‌తో మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ అప్‌డేట్ ద్వారా యువతను మరింతగా ఆకట్టుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త మార్పుల ప్రకారం, ఎన్‌టార్క్ 125 రేస్ ఎడిషన్ ఇప్పుడు డ్రిఫ్ట్ బ్లూ, ఇన్ఫెర్నో రెడ్, రష్ గ్రీన్ అనే మూడు కొత్త రంగులలో లభించనుంది. ఈ రంగులకు మ్యాచింగ్‌గా అలాయ్ వీల్స్‌ను కూడా అందిస్తుండటం విశేషం. ఇక డిస్క్ బ్రేక్ వేరియంట్‌లో మిడ్‌నైట్ బ్లాక్, స్ఫిటి వైట్ అనే కొత్త రంగులను జోడించారు. ఇప్పటికే ఉన్న నార్డో గ్రే రంగులో గ్రాఫిక్స్‌ను అప్‌డేట్ చేశారు. ఈసారి అన్ని ఎన్‌టార్క్ 125 వేరియంట్లలోనూ స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్ బ్లూటూత్ కనెక్టివిటీ, పూర్తి డిజిటల్ ఆర్‌ఎల్‌సీడీ ఇన్స్ట్రుమెంట్ కన్సోల్‌ను స్టాండర్డ్‌గా అందిస్తున్నట్లు టీవీఎస్ ప్రకటించింది. అయితే, ఇంజన్ పరంగా ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లో ఉన్న ఇంజన్, పనితీరు యథాతథంగా కొనసాగుతాయి.



# పెళ్లి వద్దనడం కంటే చంపడమే ఈజీ

**పుణే హత్య కేసులో నిందితురాలి స్టేట్‌మెంట్!**

పుణే: పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో ప్రధాన నిందితురాలు సియా గోయల్ పోలీసుల విచారణలో కీలక విషయాలు వెల్లడించింది. అప్పటికే పెళ్లి కుదిరాక... ఆ పెళ్లి ఇష్టం లేదని కుటుంబ సభ్యులకు చెప్పడం కంటే.. కేతన్‌ను హత్య చేయడమే సులభంగా అనిపించిందని ఆమె తెలిపింది. పెళ్లి వద్దంటే కుటుంబ సభ్యులు బాధపడతారని, కేతన్ ను చంపేస్తే పెళ్లి ఆగిపోతుందని సియా భావించింది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. తన ప్రేమికుడు చేతన్ చౌదరితో కలిసి ఈ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు తేల్చిన విషయం తెలిసిందే. నవంబర్‌లో జరగాల్సిన పెళ్లిని రద్దు చేస్తే కుటుంబ సభ్యులు బాధపడతారని భావించి.. ఈ నిర్ణయం తీసుకున్నానని సియా చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తు కోసం పుణే, లోనావాలా పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సియా తల్లిదండ్రులను లోనావాలా సిటీ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఆమె సోదరుడు సాహిల్ గోయల్‌ను కూడా రెండోసారి ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సాహిల్‌ను దాదాపు 10 గంటల పాటు విచారించిన పోలీసులు.. సియా, చేతన్ పరిచయం గతేడాది దీపావళి వేడుకల్లో ఓ కామన్ ఫ్రెండ్ ద్వారా ఏర్పడిందని గుర్తించారు. ఆ తర్వాత ఇద్దరూ తరచూ మాట్లాడుకుంటూ ప్రేమలో పడ్డారని దర్యాప్తులో తేలినట్లు సమాచారం.

సియా ఇలా చేస్తుందనుకోలే: పెళ్లి పెద్ద

పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా గోయల్ మేనమామ నరేంద్ర మిట్టల్, అత్త రేణు మిట్టల్ పోలీసుల ఎదుట తమ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. కేతన్, సియా కుటుంబాలను పరిచయం చేసి, వారి పెళ్లి సంబంధం కుదర్చడంలో కీలక పాత్ర పోషించిన మేనమామ నరేంద్ర మిట్టల్.. తన మేనకోడలిపై వచ్చిన ఆరోపణలు విని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సియా చిన్నప్పటి నుంచి తమకు తెలుసని, ఆమె ఇంతటి ఘోరానికి పాల్పడిందంటే నమ్మలేకపోతున్నామని ఆయన పోలీసులకు తెలిపారు. "సియా, కేతన్ ఇద్దరూ చాలా మంచివారు, ప్రశాంత స్వభావం కలవారు. సియా ఇలా చేస్తుందని మేము కలలో కూడా ఊహించలేదు" అని నరేంద్ర మిట్టల్ విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. తమ పాత్ర కేవలం రెండు కుటుంబాలను కలపడానికే పరిమితమని నరేంద్ర మిట్టల్, రేణు మిట్టల్ దంపతులు స్పష్టం చేశారు.

## మల్యాల సీఐగా రాజ్‌కుమార్ బాధ్యతలు



మల్యాల, జూన్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మాదాసు రాజ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న నీలం రవి బదిలీ కాగా, ఆయన స్థానంలో నియమితులైన రాజ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మల్యాల సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరించి సమాచారం అందించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి ఎస్ఐలు, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## బంగారంపై సౌదీ పరిమితులు

రియాద్: సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. మనీలాండరింగ్ నిరోధక చర్యల్లో భాగంగా బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో ఉన్న 60,000 సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని ప్రస్తుతం 40,000 రియాల్స్‌కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. సౌదీ అరేబియాలోని జకాత్, ట్యాక్స్ అండ్ కస్టమ్స్ అథారిటీ ఈ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. దీని ప్రకారం, ఎవరైనా 40,000 సౌదీ రియాల్స్ (సుమారు రూ. 10 లక్షలు) లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలు తీసుకెళుతున్నట్లయితే కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. వీటికి సంబంధించిన కొనుగోలు ఇన్‌వాయిస్‌లను కూడా అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

## ఆంథ్రోపిక్ ఏఐ మోడల్‌పై పాక్షికంగా ఆంక్షల ఎత్తివేత

వాషింగ్టన్: అగ్రశ్రేణి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఆంథ్రోపిక్‌కు అమెరికా ప్రభుత్వం నుంచి పాక్షిక ఊరట లభించింది. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఇటీవలే నిషేధించిన శక్తివంతమైన 'క్లాడ్ మైథోస్ 5' ఏఐ మోడల్‌ను పరిమితంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఎంపిక చేసిన కొన్ని విశ్వసనీయ అమెరికన్ సంస్థలకు మాత్రమే ఈ యాక్సెస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టం చేసింది. సరైన భద్రతా ప్రమాణాలను అమలు చేస్తున్న నేపథ్యంలో, విశ్వసనీయ భాగస్వాములకు క్లాడ్ మైథోస్ 5 మోడల్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతిస్తున్నట్లు వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ శుక్రవారం రాసిన లేఖలో పేర్కొన్నారు.

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు: అమిత్ షా

అహ్మదాబాద్: రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శనివారం గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు, ఆటో-రిక్షాలు, ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు.

# టీఎన్‌సీసీ కొత్త అధ్యక్షుడిగా మాణికం ఠాకూర్



చెన్నై/న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా విరుదునగర్ లోక్‌సభ ఎంపీ బి. మాణికం ఠాకూర్‌ను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. 2024 ఫిబ్రవరి నుంచి ఈ పదవిలో కొనసాగుతున్న కె. సెల్వపెరుంతగై స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తును మరింత బలోపేతం చేసే వ్యూహంలో భాగంగానే ఈ నియామకం జరిగినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. సెల్వపెరుంతగై డీఎంకే పట్ల సానుకూల ధోరణితో ఉన్నారనే అభిప్రాయం పార్టీలో ఉండగా, మాణికం ఠాకూర్ ఆది నుంచి టీవీకేతో సన్నిహిత సంబంధాలను కోరుకుంటున్నారు. డీఎంకేతో పొత్తును ఆయన గతంలో బహిరంగంగానే వ్యతిరేకించారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్, 27 స్థానాల్లో బరిలోకి దిగి కేవలం 5 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఎన్నికల ఫలితాల అనంతరం డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చిన కాంగ్రెస్, అధికార టీవీకేతో జతకట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వంలో రెండు మంత్రి పదవులను కూడా దక్కించుకుంది. ప్రస్తుతం లోక్‌సభలో కాంగ్రెస్ విప్‌గా వ్యవహరిస్తున్న మాణికం ఠాగూర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## మహారాష్ట్ర టెట్.. ముఖం కనిపించేలా హిజాబ్!

ముంబై: మహారాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) డ్రెస్ కోడ్‌కు సంబంధించి రాష్ట్ర పరీక్షా మండలి (ఎంఎస్‌సీఈ) కీలక సవరణలు చేసింది. మహిళా అభ్యర్థులు హిజాబ్, బురఖా లేదా దుపట్టా ధరించి పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతించింది. అయితే, సీసీటీవీ నిఘా మరియు బయోమెట్రిక్ వెరిఫికేషన్ ప్రక్రియల నిమిత్తం ముఖం, చెవులు, నోరు స్పష్టంగా కనిపించాలని నిబంధన విధించింది. తొలుత మాస్కులు, టోపీలతో పాటు హిజాబ్ వంటి వస్త్రధారణపై అధికారులు నిషేధం విధించారు. దీనిపై అభ్యర్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో, పరీక్షల పారదర్శకతకు భంగం కలగకుండా చూసేందుకు అధికారులు ఈ సవరించిన మార్గదర్శకాలను విడుదల చేశారు.

## కేంద్ర మంత్రికి 99 లక్షల సబ్సిడీ

**సొంత శాఖ నుంచే లబ్ధి**

న్యూఢిల్లీ: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి వివాదంలో చిక్కుకున్నారు. తన సొంత మంత్రిత్వ శాఖ పరిధిలోని పథకం ద్వారా ఆయన ఏకంగా రూ.99.03 లక్షల సబ్సిడీని పొందడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిని కొత్త తరహా అవినీతిగా అభివర్ణిస్తూ విపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. రాజస్థాన్‌లోని పర్బత్‌సర్ తహసీల్ పీహ్ గ్రామంలో గల చౌదరి కుటుంబ వ్యవసాయ క్షేత్రంలో వాణిజ్యపరంగా దోసకాయల సాగు నిమిత్తం ఈ సబ్సిడీ మంజూరైంది. జాతీయ ఉద్యానవన బోర్డు ఈ ప్రాజెక్టుకు 2026 మార్చి 11న తుది ఆమోదం తెలిపింది. మార్చి 30న సబ్సిడీ మొత్తం ఆయన బ్యాంక్ ఖాతాలో జమ అయింది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ఈ జాతీయ ఉద్యానవన బోర్డుకు భగీరథ్ చౌదరి ఎక్స్-అఫీషియో వైస్-ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తుండటమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఈ ఆరోపణలను మంత్రి భగీరథ్ చౌదరి తీవ్రంగా ఖండించారు. "నేను ఒక రైతును, చిన్నతనం నుంచే వ్యవసాయం చేస్తున్నాను. ఇందులో దాచాల్సింది ఏమీ లేదు. వేలాది మంది రైతులు పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకుని సబ్సిడీలు పొందుతున్నారు, నేను కూడా అదే నిబంధనల ప్రకారం పొందాను. దీనికోసం 2018లోనే దరఖాస్తు చేసుకున్నాను" అని ఆయన స్పష్టం చేశారు. తన ఫామ్‌లో తీసుకున్న రుణాలు, సబ్సిడీల వివరాలతో కూడిన బోర్డును అక్కడ ప్రదర్శిస్తున్నామని, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ కూడా ఇస్తున్నామని ఆయన వివరించారు.

## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ-ట్రంప్‌ల మధ్య అద్భుతమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఇరు దేశాల సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి ట్రంప్ పర్యటన ఏర్పాట్లను ఖరారు చేసే అవకాశం ఉందని రూబియో వెల్లడిడించారు. వాషింగ్టన్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్ అమెరికాకు అత్యంత సన్నిహిత భాగస్వామి, మిత్రదేశమని పేర్కొన్నారు. ట్రంప్ తన తొలి హయాంలో 2020 ఫిబ్రవరిలో భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్ సమావేశమయ్యారని రూబియో గుర్తు చేశారు. ఇద్దరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధం దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కూడా తుది దశకు చేరుకుందని వెల్లడించారు. చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. ఒప్పందం పూర్తి కావడానికి ఇంకొన్ని అడుగుల దూరంలోనే ఉన్నామని తెలిపారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com



## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చాత్రోన్ కీ గూంజ్' ఉద్యమం

**జగిత్యాలలో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

జగిత్యాల, జూన్ 27 (ఈవార్తలు): కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజి ముఖేష్ కన్నా ఆధ్వర్యంలో జగిత్యాలలో "చాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమాన్ని విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా మారాయని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, ఉపాధి అవకాశాల కొరత వల్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులపై విద్యార్థుల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకునేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా "చాత్రోన్ కీ గూంజ్" ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను జాతీయ చర్చ అంశంగా మార్చడమే ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యారంగంలో సమగ్ర సంస్కరణల కోసం కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉద్యమంలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దయాల శరత్, ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు చెట్టే భార్గవ్, కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు ద్యావనపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అయోధ్య విరాళాల చోరీపై జ్యుడీషియల్ విచారణ

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్**

జగిత్యాల, జూన్ 27 (ఈవార్తలు): అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఘటనపై సిట్ విచారణతో పాటు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాలలో శనివారం నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయ విరాళాల చోరీ ఘటనలో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే న్యాయ విచారణ అవసరమని అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించిన ఆయన, 12 ఏళ్ల పాలనపై సంబరాలు చేసుకోవడం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, జిల్లా ఇన్‌చార్జి బోయిని అశోక్, వెన్న సురేష్, వెన్న మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఫొటో

## బాల్క సుమన్‌కు దావ వసంత సురేశ్ పరామర్శ



హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రశ్నించినందుకు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎంపీ, మాజీ విప్ బాల్క సుమన్‌ను జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ శనివారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని సంఘీభావం ప్రకటించారు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బాల్క సుమన్ ధైర్యంగా ప్రజల తరఫున పోరాటం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్తు ఇబ్బందులు ఉండొద్దు

**విద్యుత్ అధికారులతో జగిత్యాల ఎమ్మెల్యే సమీక్ష**

జగిత్యాల, జూన్ 27 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గానికి చెందిన విద్యుత్ శాఖ అధికారులతో శనివారం ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ లైన్లను అవసరమైన చోట షిఫ్ట్ చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, ఖరీఫ్ పంటల సాగుకు ఇబ్బంది కలగకుండా త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ చుట్టుపక్కల రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్స్‌ను త్వరితగతిన మార్చాలని, వర్షాకాలంలో ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులైన వారికి 200 యూనిట్ల విద్యుత్ సదుపాయం అందేలా చూడాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా పంట పొలాలు, గ్రామాల్లో వంగిపోయిన, పాడైన విద్యుత్ పోల్స్‌ను తక్షణమే మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల అనుకూల ప్రభుత్వంలో ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ సుదర్శనం, డీఈ గంగారం, ఏడీఈలు జవహర్ నాయక్, సిందూర్ శర్మ, ఎస్ఏవో శ్రీనివాస్, ఏఈలు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.




# భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో అమర జవాన్లకు ఘన నివాళి

జగిత్యాల, జూన్ 27 (ఈవార్తలు): జగిత్యాల: ఆపరేషన్ సిందూర్‌లో దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ చౌరస్తాలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడంతో పాటు రెండు నిమిషాల మౌనం పాటించి వీరుల త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు, కౌన్సిలర్ అరవ లక్ష్మి, నాయకులు చిట్లా గంగాధర్ తదితరులు మాట్లాడుతూ దేశ సరిహద్దులను కాపాడుతూ ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి సేవలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. అమర వీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, దేశ రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న సైనికులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వేముల పోచమల్లు, నారెండుల శ్రీనివాస్, వేముల దేవారజం, కట్ట రామకృష్ణ, ఎడమల వెంకట్ రెడ్డి, కొత్తకొండ భాలన్న, కొక్కుల ఆంజనేయులు, సిరిపురం గంగారాం, బొంధుకురి శ్రీనివాస్, కస్తూరి శంకర్, జనయ్య, అనుమల్ల బుజంగం తదితర నాయకులు పాల్గొన్నారు.



# కోరుట్లకు ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలి

**మంత్రి పొన్నంకు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ వినతి**

హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో అత్యవసరంగా ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోరుట్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర ఘటనలు సంభవించినప్పుడు వెంటనే స్పందించేందుకు ప్రత్యేక ఫైర్ స్టేషన్ అవసరమని ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుతం అగ్నిమాపక సేవలు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తుండటంతో స్పందనలో జాప్యం ఏర్పడే అవకాశముందని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు కోరుట్లలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పట్టణ ప్రజల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కోరుట్లకు త్వరితగతిన ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే డా. సంజయ్ కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



## వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

వెల్గటూర్, జూన్ 27 (ఈవార్తలు): వార్షిక తనిఖీల్లో భాగంగా జగిత్యాల సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) కె. పురుషోత్తం రెడ్డి వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, సీసీటీఎన్ఎస్ నమోదు, పెండింగ్ కేసుల దర్యాప్తు, వారెంట్లు, సమన్లు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ ప్రజలకు న్యాయం అందించే తొలి వేదిక అని పేర్కొన్న డీఎస్పీ, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన కేసులను సున్నితంగా విచారించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఆన్‌లైన్ మోసాల నివారణకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, పేకాట, ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయి ఇంటెలిజెన్స్‌ను బలోపేతం చేసి, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు మహేష్, సతీష్, కృష్ణసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండు చుక్కలే... జీవితాంతం రక్షణ!

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి.. వైద్య ఆరోగ్య శాఖ పిలుపు**



చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి శాశ్వతంగా రక్షించేందుకు రాష్ట్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా నిర్వహిస్తోంది. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 22,979 ప్రత్యేక పోలియో బూత్‌లు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో కూడా ప్రత్యేక కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు చేపడుతున్నారు.

**పోలియో అంటే ఏమిటి?**

పోలియో అనేది వైరస్ వల్ల వచ్చే ప్రమాదకరమైన అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఐదేళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపి చేతులు, కాళ్లు శాశ్వతంగా పనిచేయకుండా చేసే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు. ఈ వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లేకపోవడంతో, ముందస్తు నివారణే ఉత్తమ మార్గమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**రెండు చుక్కలే... బంగారు భవిష్యత్తుకు భరోసా**

పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పలుమార్లు పోలియో చుక్కలు వేయించడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. సాధారణ టీకాలు ఇప్పటికే తీసుకున్నప్పటికీ, జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ప్రత్యేక షెడ్యూల్**

**జూన్ 28 (ఆదివారం): రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 22,979 పోలియో బూత్‌లలో చుక్కలు వేస్తారు.**

**జూన్ 29, 30 (సోమవారం, మంగళవారం): మొదటి రోజు రాలేని చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు.**

**జులై 1 (బుధవారం): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ప్రత్యేకంగా మరో రోజు కార్యక్రమాన్ని కొనసాగిస్తారు.**

– దూడం శ్రీశైలం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
జగిత్యాల జిల్లా. 9133947176



## ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ

**పార్టీలో 200 మంది చేరిక**

మల్కాజిగిరి, జూన్ 27 (ఈవార్తలు): మల్కాజిగిరి నియోజకవర్గంలోని నేరేడ్మెట్ చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకురాలు పిట్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పిట్ల విజయలక్ష్మి మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి, మహిళా సాధికారత లక్ష్యాలతో పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ప్రకటించిన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన ధ్యేయమని, తెలంగాణ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం పిట్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 200 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమం అనంతరం హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజల కోసం భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి, కుల శ్రీనివాస్, మేక లలిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు. జెండా పండుగతో పాటు భారీగా జరిగిన చేరికలతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.



## ముత్యంపేటలో గంగమ్మ బోనాల పండుగ

మల్యాల, జూన్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో గంగమ్మ బోనాల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ వీధుల గుండా బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పండుగను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

## జూలై 10న ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాల స్నాతకోత్సవం




హైదరాబాద్, జూన్ 27 (ఈవార్తలు): రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. మంజుల, వైస్ ప్రిన్సిపాల్ సిందూరిలతో కలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణ పతకాలను అందించనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి. సుమతి ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఓయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రధానం చేస్తారని తెలిపారు.

# కొండగట్టు గుట్టపై ఇక ఫుల్ సిగ్నల్!



మల్యాల, జూన్ 27 (ఈవార్తలు): భక్తులకు మెరుగైన మొబైల్ కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించేందుకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మొబైల్ టవర్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనుమతి ఇవ్వడంతో, ఇండస్ టవర్స్ సంస్థతో దేవస్థానం ఒప్పందం (అగ్రిమెంట్) కుదుర్చుకుంది. టవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యమైన మొబైల్ సిగ్నల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇండస్ టవర్స్ ప్రతినిధులు దేవస్థానాన్ని సందర్శించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ (ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ) సంతోష్ రాయ్, బిజినెస్ హెడ్ అరుణ్ కుమార్, కన్‌స్ట్రక్షన్ మేనేజర్ సదానందం, అక్విజిషన్ మేనేజర్ రమేష్ బాబు టవర్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి హరిహరనాథ్, పర్యవేక్షకుడు సునీల్ కుమార్ టవర్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై ఇండస్ టవర్స్ అధికారులతో చర్చించారు. భక్తులకు నిరంతరాయంగా నాణ్యమైన మొబైల్ సేవలు అందేలా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కొండగట్టు ఆలయానికి ప్రతి రోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో, మొబైల్ టవర్ ఏర్పాటు ద్వారా కమ్యూనికేషన్ సమస్యలు తగ్గి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

వయ్యారి చిత్రం



మౌనీ రాయ్




# ప్రముఖ నటుడు భాగ్యరాజ్ హఠాన్మరణం



ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు, కథా రచయిత కె. భాగ్యరాజ్ (73) గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. ఇటీవలే ఆయన నటి ఖుష్బూ కుమార్తె వివాహ వేడుకకు గోవాలో హాజరయ్యారు. ఇంతలోనే తుదిశ్వాస విడవడం సినీ పరిశ్రమను విషాదంలోకి నెట్టింది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో భాగ్యరాజ్‌గా జన్మించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద సహాయ దర్శకుడిగా సినీ ప్రయాణం ప్రారంభించారు. అనంతరం దర్శకుడిగా, కథా రచయితగా, నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మధ్యతరగతి కుటుంబాల జీవనశైలిని ప్రతిబింబించే కథలు, సహజమైన సంభాషణలు, భావోద్వేగాలతో కూడిన చిత్రాలకు ఆయన పెట్టింది పేరు. 1980, 1990 దశకాల్లో తమిళ సినీ పరిశ్రమలో అత్యంత విజయవంతమైన దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. కెరీర్‌లో 25కు పైగా చిత్రాలకు భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు. 75కిపైగా సినిమాల్లో నటించారు. ముందానై ముడిచ్చు, అంధా 7 నాట్కల్, డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్ వంటి చిత్రాలు ఆయనకు చిరస్థాయి గుర్తింపు తెచ్చాయి. తెలుగులోనూ కుబేర, 35, సీత, రెడ్ అలర్ట్, మేం వయసుకు వచ్చాం వంటి చిత్రాల్లో మెరిశారు. హిందీలోనూ ఆఖ్రీ రాస్తా చిత్రానికి దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, శ్రీదేవి, జయప్రద ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. భాగ్యరాజ్ సేవలను గుర్తించిన అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు ఎంజీఆర్.. సినీ రంగంలో తన వారసుడిగా ఆయనను ప్రశంసించడం విశేషం. భాగ్యరాజ్‌కు భార్య పూర్ణిమ భాగ్యరాజ్, కుమారుడు శంతను భాగ్యరాజ్, కుమార్తె శరణ్య ఉన్నారు.




### ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

భాగ్యరాజ్ మరణం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ఆదేశించారు. భారతీయ సినిమాకు భాగ్యరాజ్ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒక సంతాప సందేశాన్ని విడుదల చేశారు. భాగ్యరాజ్ మరణం తమిళ చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర సాంస్కృతిక రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. దర్శకుడిగా, నటుడిగా, కథా రచయితగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞ కనబరిచిన అరుదైన ప్రతిభాశాలి అని కొనియాడారు. తన విలక్షణమైన కథన శైలి, సహజమైన హాస్యం, గ్రామీణ నేపథ్యాలను వాస్తవికంగా చూపిన విధానంతో తమిళ సినిమాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తుచేశారు.



## 'రాకా'లో రష్మిక!?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'రాకా'. ఈ సినిమాలో ఇప్పటికే బాలీవుడ్ టాప్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ విజువల్ వండర్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై దాదాపు రూ. 700 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అట్లీ గత చిత్రం 'జవాన్' బాక్సాఫీస్ వద్ద రూ. 1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో, ఈ సినిమాపై అంచనాలు అంతకుమించి ఉన్నాయి. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన ఏదో ఒక వార్త వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా, 'రాకా' చిత్రానికి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ వార్త సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తోంది.

## విడాకులు నచ్చవు.. అందుకే పెళ్లి వద్దు



ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా వరుస సినిమాలు చేస్తున్న ఎవర్ గ్రీన్ బ్యూటీ త్రిష.. తాజాగా తన పెళ్లిపై కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచింది. 'మీరు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడిగితే నా దగ్గర ఆన్సర్ లేదు. ఎందుకంటే అది పూర్తిగా నేను కలుసుకోబోయే వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. ఆ పర్సని చూసినప్పుడు 'నేను ఇతనితో జీవితాంతం కలిసి జీవించగలను' అనే ఫీల్ రావాలి. ఎందుకంటే నేను డివోర్స్‌ను నమ్మను. అసలు నాకు విడాకుల ప్రక్రియనే నచ్చదు. మ్యారేజ్ లైఫ్‌లో సంతోషంగా లేక తప్పుడు నిర్ణయాలతో విడాకులు తీసుకున్న వాళ్లను నేను చాలా మందిని చూశాను. అలాగే కొంత మంది చుట్టాల కోసం, పిల్లల కోసం, చుట్టుపక్కల వాళ్లకోసం నచ్చకపోయిన కలిసి బతికడం కూడా చూశాను. కాబట్టి నేను ఇవన్నీ అస్సలు తట్టుకోలేను. ఒకవేళ నేను పెళ్లి చేసుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ విడాకులు తీసుకోను. కేవలం సమాజం కోసమో, ఒంటరితనం భరించలేకో కాకుండా.. జీవితాంతం కలిసి ఉండే సరైన తోడు దొరికినప్పుడు కచ్చితంగా పెళ్లి చేసుకుంటా' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.


## 'ఇడుపు కాయితం' ప్రాంతం సినిమా కాదు




టైటిల్ వివాదంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది 'ఇడుపు కాయితం'. ఈ సినిమా యాస, భాష, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి సోషల్ మీడియాలో ఒకరినొకరు దూసించుకుంటున్నారు. ఈ క్రమంలోనే సినిమా నిర్మాత బన్నీ వాసు టైటిల్ వివాదంపై క్లారిటీ ఇచ్చారు. 'ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై చర్చ అనవసరం. ఆంధ్రా, తెలంగాణ అని కాదు.. ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. కాబట్టి షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. కాబట్టి నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట నిజమే. సినిమా రిలీజ్ అయ్యాక అన్నీ అవే సర్దుకుంటాయి. ఫైనల్‌గా ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. ఒకవేళ ప్రాంతాన్ని బట్టి కథ ఉంటుందా? అంటే ఎక్కడో తీసిన హాలీవుడ్ మూవీ ఇక్కడ ఆడదు కదా.. ఇది ప్రతి ఇంటిలో ఉండే కథ.

## బడ్జెట్‌లో 40 శాతం హీరోకే: దిల్ రాజు

హీరోల పారితోషికాలు ఆకాశాన్ని తాకుతుండటంతో సినిమా బడ్జెట్లు కంట్రోల్ తప్పిపోతున్నాయనే చర్చ ఎప్పటి నుంచో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ... వాస్తవాలను వెల్లడించారు. సినిమా మార్కెట్ ఈక్వేషన్స్ ఏంటో తాను హీరోలకు ముందే క్లియర్‌గా చెబుతానని, తన బడ్జెట్ పరిధికి సెట్ అయ్యే



హీరోలతోనే సినిమాలు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అయితే,టాలీవుడ్ అగ్ర హీరోలు తమ రెమ్యునరేషన్ తగ్గించుకోవడానికి అస్సలు ఇష్టపడరని, దానికి కారణం పారితోషికం తగ్గితే మార్కెట్‌లో తమ 'ఇమేజ్' పడిపోతుందనే భయమేనని చెప్పారు. ఒక వేళ రూ. 300 కోట్ల బడ్జెట్‌తో సినిమా తీస్తే... అందులో దాదాపు 35 శాతం నుండి 40 శాతం వరకు (అంటే రూ. 100 కోట్ల నుండి 120 కోట్లు) కేవలం ఒక్క హీరో రెమ్యునరేషన్‌కే వెళ్ళిపోతుందని షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. టాలీవుడ్ బడ్జెట్ సమస్యకు చెక్ పెట్టాలంటే హిందీ చిత్రసీమ ఫాలో అవుతున్న సరికొత్త బిజినెస్ స్ట్రాటజీని అనుసరించాలని దిల్ రాజు చెప్పారు. బాలీవుడ్‌లో ఇప్పుడు స్టార్ హీరోలు ముందే వందల కోట్లు డిమాండ్ చేయకుండా... సినిమా లాభాల్లో వాటా తీసుకునే 'ప్రాఫిట్ షేరింగ్ మోడల్'కు షిఫ్ట్ అయ్యారన్నారు. దీనికి బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ ను బెస్ట్ ఉదాహరణగా చెప్పారు. ఒకప్పుడు అక్షయ్ ఒక్కో సినిమాకు రూ. 130 కోట్ల వరకు ఫిక్స్‌డ్ రెమ్యునరేషన్ తీసుకునేవారని, కానీ ప్రస్తుత మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ఆయన కూడా లాభాల్లో వాటా తీసుకునే విధానాన్నే ఎంచుకున్నారని తెలిపారు.



## తోడు కోసం చూస్తున్నా

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ రియా చక్రవర్తి చాలాకాలం గ్యాప్ తర్వాత ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో రాణించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2020లో తన ప్రియుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత జైలుకి వెళ్లిన ఆమె ఆ సమయంలో ఎదుర్కొన్న తీవ్రమైన పరిస్థితులు, ఆ తర్వాత తన జీవితంలో మిగిలిన మానసిక క్షోభ గురించి పలు ఇంటర్వ్యూలో పంచుకుంటున్నారు. ఇంకా ఆ బాధ నుండి కోలుకోలేదని అందుకు చికిత్స కూడా తీసుకుంటున్నట్లు కూడా తెలిపారు. తాజాగా, యూట్యూబ్ టాక్ షో 'డబుల్ డేట్'లో తన తమ్ముడు షోవిక్ చక్రవర్తితో కలిసి పాల్గొన్న రియా.. తమ ప్రస్తుత జీవితం, రిలేషన్‌షిప్స్, పెళ్లిపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ప్రస్తుతం తనకు భాగస్వామి కావాలనే కోరిక ఏమీ లేదని, కానీ భవిష్యత్తులో ఒక మంచి తోడు దొరకాలని అనుకుంటున్నాను. అలాగే నన్ను అర్థం చేసుకునే వ్యక్తి దొరికితే బాగుంటుందని రియా పేర్కొన్నారు. తన ప్రస్తుత మానసిక స్థితిని వివరించడానికి ఆమె పరిణతి చెందిన అనే పదాన్ని ఉపయోగించారు.



## జొకోవిచ్ కొత్త అవతారం

టెన్నిస్ ప్రపంచంలో తిరుగులేని రారాజుగా వెలుగొందుతున్న నొవాక్ జొకోవిచ్, ఇప్పుడు వ్యాపార ప్రపంచంలోకి ఓ కీలక అడుగు వేశారు. ప్రఖ్యాత గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ 'జనరల్ అట్లాంటిక్'కు గ్లోబల్ స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ విషయాన్ని సదరు సంస్థ అధికారికంగా ప్రకటించింది. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ బరిలోకి దిగడానికి కొద్ది రోజుల ముందు ఈ ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కొత్త బాధ్యతల్లో భాగంగా జొకోవిచ్... జనరల్ అట్లాంటిక్ సంస్థ నాయకత్వ బృందంతో, దాని పోర్ట్‌ఫోలియో కంపెనీలతో, పెట్టుబడిదారులతో కలిసి పనిచేస్తాడు. ముఖ్యంగా నాయకత్వ పటిమ, స్థితిస్థాపకత, ఆవిష్కరణలు వంటి అంశాలపై తన అనుభవాలను, దృక్పథాన్ని పంచుకోనున్నాడు. ఈ నియామకం ద్వారా జొకోవిచ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని, ముఖ్యంగా హెల్త్, వెల్నెస్ రంగంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని జనరల్ అట్లాంటిక్ భావిస్తున్నట్లు 'బ్లూమ్‌బెర్గ్' తన కథనంలో పేర్కొంది.

## కేప్ వర్డె వరల్డ్ రికార్డు

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఓ చిన్న దేశం అద్భుతం చేసింది. తమ చరిత్రలోనే తొలిసారి ఫీఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించి కేప్ వర్డె సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. సౌదీ అరేబియాతో జరిగిన కీలకమైన గ్రూప్-హెచ్ మ్యాచ్‌ను గోల్స్ లేకుండా 'డ్రా'గా ముగించిన కేప్ వర్డె, గ్రూప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ చారిత్రక విజయంతో జులై 3న మయామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాతో తలపడనుంది. ఫీఫా ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరిన అతి చిన్న దేశంగా కేప్ వర్డె రికార్డు సృష్టించింది. గ్రూప్ దశలో కేప్ వర్డె ప్రదర్శన అద్భుతం. ఆడిన మూడు మ్యాచులనూ డ్రా చేసుకుని, మూడు పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో మాజీ ఛాంపియన్ ఉరుగ్వే, సౌదీ అరేబియా జట్లను వెనక్కి నెట్టి నాకౌట్‌కు అర్హత సాధించింది. సౌదీతో జరిగిన మ్యాచ్‌లో కేప్ వర్డె జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. విల్లీ సెమెడో, కెవిన్ పినా వంటి ఆటగాళ్లు గోల్స్ చేయడానికి చేసిన ప్రయత్నాలు త్రుటిలో విఫలమయ్యాయి. సౌదీ గోల్ కీపర్ మహమ్మద్ అల్ ఒవైస్ అద్భుతమైన సేవ్లతో జట్టును ఆదుకున్నాడు. మ్యాచ్ ముగియడానికి 15 నిమిషాల ముందు లారోస్ దువార్టే కొట్టిన షాట్‌ను ఒవైస్ అడ్డుకోవడంతో కేప్ వర్డె ఆధిక్యం కోల్పోయింది. అయినప్పటికీ, మ్యాచ్‌ను డ్రాగా ముగించి నాకౌట్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ ఘనతతో కేప్ వర్డె మరో అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. తమ తొలి ప్రపంచకప్ గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా నాకౌట్‌కు చేరిన మూడో ఆఫ్రికన్ దేశంగా నిలిచింది. గతంలో మొరాకో (1986), కామెరూన్, నైజీరియా (1998, 2014) ఈ ఘనత సాధించాయి.

**రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించిన జట్లు:**

మెక్సికో, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్, కెనడా, బోస్నియా అండ్ హెర్జెగోవినా, బ్రెజిల్, మొరాకో, యునైటెడ్ స్టేట్స్, ఆస్ట్రేలియా, పరాగ్వే, జర్మనీ, కోట్ డి ఐవరీ, ఈక్వెడార్, నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, బెల్జియం, ఈజిప్ట్, స్పెయిన్, కేప్ వర్డె, ఫ్రాన్స్, నార్వే, సెనెగల్, అర్జెంటీనా, కొలంబియా, పోర్చుగల్, ఇంగ్లాండ్, ఘనా.



## ఫిఫా స్ట్రీమింగ్.. 400 వెబ్‌సైట్లు సీజ్

ఫిఫా వరల్డ్‌కప్‌ను అక్రమ రీతిలో లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్న సుమారు 400 వెబ్‌సైట్లను అమెరికా సీజ్ చేసింది. ఆ డొమెయిన్లను గుర్తించినట్లు అమెరికా న్యాయ శాఖ తెలిపింది. సాకర్ సంఘం ఫిఫాతో పాటు ఇతర ఏజెన్సీలు ఆ అక్రమ వెబ్‌సైట్లను గుర్తించినట్లు న్యాయశాఖ పేర్కొన్నది. ఎన్‌బీసీ యూనివర్సల్ తో పాటు వార్నర్ బ్రదర్స్ కూడా సహకరించినట్లు చెప్పింది. అంతర్జాతీయ నెట్వర్క్‌ల ఆదాయానికి గండి కొట్టే ఉద్దేశంతోనే అక్రమ వెబ్‌సైట్లు నిర్వహణ జరిగినట్లు అమెరికా న్యాయశాఖ అభిప్రాయపడింది. కాపీరైట్ చట్టాలను ఆ వెబ్‌సైట్లు ఉల్లంఘించినట్లు కోర్టు పేర్కొన్నది. ఇంటర్నేషనల్ కంప్యూటర్ హ్యాకింగ్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ నెట్వర్క్‌లో శిక్షణ పొందిన అధికారులు వివిధ దేశాల్లోనే వెబ్‌సైట్లను గుర్తించారు. వరల్డ్‌కప్ మ్యాచ్‌లకు చెందిన అక్రమ స్ట్రీమింగ్ సర్వర్లు, డొమెయిన్లను టార్గెట్ చేశారు. పెరూ, బల్గేరియా దేశాల్లో ఆ సర్వర్లు, డొమెయిన్లు ఉన్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ పైరసీకి చెందిన ఆ రెండు కేంద్రాలపై నజర్ పెట్టారు. క్రొయేషియా, రొమేనియా, పోలాండ్, కొలంబియా దేశాల్లోనూ హ్యాకింగ్ ప్రదేశాలను గుర్తించారు.





# ఇరాన్‌కు ఈజిప్ట్ షాక్

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఇరాన్ నాకౌట్ బెర్తు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టోర్నీలో అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నా గొప్పగా ఆడిన ఆ జట్టు ఈజిప్ట్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకోవమే అందుకు కారణం.

**చివరి నిమిషంలో ఇరాన్ ఆటగాడు ఖలిజదేహ్ గోల్ చేసినా వీడియో అసిస్టెంట్ రిఫరీ మాత్రం లెక్కలోకి తీసుకోకపోవడం ఈజిప్ట్ 32వ రౌండ్‌కు దూసుకెళ్లింది. దాంతో.. ఇరాన్ ఆటగాళ్లు నిరాశలో మునిగిపోయారు. గ్రూప్ జీలోని ఇరాన్, ఈజిప్ట్ నాకౌట్ బెర్తు లక్ష్యంగా హోరాహోరీగా తలపడ్డాయి.**

ఐదో నిమిషంలోనే మహమూద్ సబెర్()గోల్ అందించగా.. ఈజిప్ట్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కాసేపటికి ఇరాన్‌కు పెనాల్టీ లభించినా సద్వినియోగం చేసుకోలేదు. ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తూ 14వ నిమిషంలో రమిన్ రజీయన్ గోల్‌తో ఇరాన్ 1-1తో స్కోర్ సమం చేసింది. ఆ తర్వాత ఇరుజట్ల ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించారు. మ్యాచ్ డ్రా ఖాయమనుకున్న వేళ.. 93వ నిమిషంలో నిమిషంలో ఆట ముగుస్తుందనగా.. ఇరాన్ ప్లేయర్ ఖలిజదేహ్ ఈజిప్ట్ గోల్‌పోస్ట్‌లోకి బంతిని పంపాడు. 2-1తో ఆసియా జట్టు గెలిచిందనుకుంటే.. బంతి ఆఫ్ సైడ్ వెళ్లిందని వీడియో అసిస్టెంట్ రిఫరీ గోల్ ఇవ్వలేదు. దాంతో, 1-1తో మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఈజిప్ట్ నాకౌట్‌లో అడుగుపెట్టింది. గ్రూప్ జీ నుంచి బెల్జియం, ఈజిప్ట్ 32వ రౌండ్‌కు చేరగా.. మూడో స్థానంతో ఇరాన్ నాకౌట్ చేరే అవకాశముంది.



## వైభవ్ ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తాడు: సంగక్కర

15 ఏళ్ల వయసులోనే భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన వైభవ్ సూర్యవంశీపై రాజస్థాన్ రాయల్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ కుమార సంగక్కర ప్రశంసల వర్షం కురిపించాడు. భారత క్రికెట్‌తో పాటు ప్రపంచ క్రికెట్‌లోనూ అతడు గొప్ప శక్తిగా ఎదుగుతాడని ధీమా వ్యక్తం చేశాడు. చిన్న వయసులోనే అతడిలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం, ఆటపై ఉన్న ప్రేమ అసాధారణమని కొనియాడాడు. 'స్కై స్పోర్ట్స్'తో మాట్లాడిన సంగక్కర.. క్రికెట్‌పైనే కాకుండా జీవితంలోని ఇతర విషయాలపైనా వైభవ్‌కు మంచి అవగాహన ఉందని అభిప్రాయపడ్డాడు. పేరు, డబ్బు, గుర్తింపు వంటి అంశాలు అతణ్ని ఏమాత్రం ప్రభావితం చేయవని చెప్పాడు. కుటుంబం, జట్టు నుంచి సరైన మద్దతు లభిస్తే భారత క్రికెట్, ప్రపంచ క్రికెట్‌తో పాటు ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ అతడు అగ్రస్థానానికి చేరుకుంటాడని విశ్వాసం వ్యక్తం చేశాడు. 2023లో తమ అనలిస్ట్ అక్షయ్.. 12 ఏళ్ల వైభవ్ గురించి మెసేజ్ పంపాడని సంగక్కర గుర్తుచేశాడు. మొదట అది సరదాగా అనిపించినా.. అతణ్ని ట్రయల్స్‌కు పిలిపించామని తెలిపాడు.





## మహీకాతో సీక్రెట్‌గా హార్దిక్ పెళ్లి

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. తన ప్రియురాలు, మోడల్ మహీకా శర్మను హార్దిక్ రహస్యంగా వివాహం చేసుకున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. పాపిటలో సిందూరంతో మహీకా శర్మ కనిపిస్తున్న ఒక ఫొటో ఇంటర్నెట్‌లో వైరల్ కావడమే ఈ ఊహాగానాలకు కారణమైంది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ ఫొటోలో హార్దిక్ పాండ్యా, మహీకా శర్మ పక్కపక్కనే నిల్చుని ఉన్నారు. వారి చేతులను ఒక వృద్ధురాలు పట్టుకుని ఉండగా, మహీకా పాపిటలో సిందూరం స్పష్టంగా కనిపిస్తోంది.

భారత అథ్లెటిక్స్‌లో మరో రికార్డు బద్దలైంది. మాజీ లాంగ్ జంపర్ అంజూ బాబీ జార్జ్ రికార్డును కేరళకు చెందిన అన్సీ సోజన్ బ్రేక్ చేసింది. భువనేశ్వర్ వేదికగా జరుగుతున్న నేషనల్ ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో శనివారం అన్సీ ఏకంగా 6.88 మీటర్ల దూరం దూకింది. తద్వారా 22 ఏళ్లుగా అంజూ జార్జ్ పేరిట ఉన్న రికార్డును తన సొంతం చేసుకుందీ కేరళ లాంగ్ జంపర్. లాంగ్ జంపర్ అన్సీ సోజన్ జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. నేషనల్ ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్ నాలుగో రోజు పోటీల్లో సత్తా చాటిన అన్సీ.. 6.88 మీటర్ల దూరం దూకింది. వెటరన్ లాంగ్ జంపర్ అంజూ బాబీ జార్జ్ పేరుతో ఉన్న 22 ఏళ్ల రికార్డును తన వశం చేసుకుంది. ఒకప్పుడు స్టార్ లాంగ్ జంపరైన అంజూ జార్జ్ 2004లో 6.83 మీటర్ల దూరం దూకి రికార్డు సాధించింది. ఆ తర్వాత ఆమె దరిదాపుల్లోకి ఎవరూ రాలేదు. కానీ, అన్సీ నేనున్నాను అంటూ అంజూను అధిగమించింది. రికార్డ్ జంప్‌తో సెప్టెంబర్ 19 నుంచి జపాన్‌లో మొదలయ్యే ఆసియా క్రీడలకు అన్సీ అర్హత సాధించింది.

## అన్సీ జంప్ సూపర్




ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు

ఆదివారం 28-6-2026, జగిత్యాల



# యూట్యూబ్‌లో... కొత్త బిచ్చగాళ్లు!



కన్నీళ్లే వాళ్ల కంటెంట్..
భావోద్వేగాలే వాళ్ల మార్కెట్..

వ్యూస్ రావాలన్నా..
కామెంట్లు కావాలన్నా..
డొనేషన్లు రప్పించుకోవాలన్నా..

'ఎమోషనల్ బ్లాక్‌మెయిల్' చేస్తారు..
బాధను చూపి వ్యూస్ తెచ్చుకుంటారు..
సానుభూతిని సబ్‌స్క్రైబ్ చేసుకుంటారు..
మీ నుంచే రూ.లక్షలు దండుకుంటారు..
దేశ, విదేశాల్లో సెటిలైపోతారు..

ఒక ఉమా తెలుగు ట్రావెలర్..
ఒక నా అన్వేషణ.. ఇలా ఎందరో..!
వందల చానళ్లు.. ప్రేక్షకుడికి మోసాలు!!

శ్రావణ వాణి



శ్రావణ్ కుమార్
బొమ్మకంటి, ఎడిటర్ (ఎంటెక్, ఎల్ఎల్‌బీ)
ఫోన్ నంబర్: 9581291919

ఒకప్పుడు బిచ్చగాడు వీధిలో కనిపించేవాడు. చేతిని చాచేవాడు. ఆకలి అని అర్థించేవాడు. ఇవ్వాలా.. వద్దా.. అనేది మన ఇష్టం. కానీ, ఇప్పుడు బిచ్చం అడిగే పద్ధతి మారింది. చేతిలో గిన్నె స్థానంలో కెమెరా వచ్చింది. వీధి స్థానంలో యూట్యూబ్ వచ్చింది. మాకు సపోర్ట్ చేయండి.. చానల్ నిలబెట్టండి.. మీరు లేకపోతే మేం లేం.. యూపీఐ స్కాన్ చేయండి.. మెంబర్ అవ్వండి.. అనే డిజిటల్ విజ్ఞప్తులు కొత్త సంస్కృతిగా మారుతున్నాయి. ఇక్కడ ఒక స్పష్టత అవసరం. కంటెంట్ సృష్టికర్త తన శ్రమకు ప్రతిఫలం కోరడం తప్పు కాదు. యూట్యూబ్ ప్రకటనలు, స్పాన్సర్‌షిప్‌లు, మెంబర్‌షిప్‌లు, క్రౌడ్ ఫండింగ్ వంటి ఆదాయ మార్గాలను అధికారికంగానే అందిస్తోంది. ప్రేక్షకులు స్వచ్ఛందంగా సహాయం చేయడంలో కూడా తప్పేమీ లేదు. కానీ ఒక దశ దాటిన తర్వాత కొందరు క్రియేటర్లు సహాయాన్ని అభ్యర్థించడం కాదు, సానుభూతిని వ్యాపార నమూనాగా మార్చడం ప్రారంభిస్తున్నారు. ఇదే ఆందోళనకర అంశం. డిజిటల్ మీడియా ప్రజాస్వామ్యానికి గొప్ప బలం. సంప్రదాయ మీడియా తలుపులు మూసుకున్నప్పుడు, యూట్యూబ్ సాధారణ వ్యక్తికి వేదిక కల్పించింది. ఒక రైతు తన వ్యవసాయ అనుభవాన్ని ప్రపంచానికి చెప్పగలిగాడు. ఒక ఉపాధ్యాయుడు ఉచిత పాఠాలు అందించగలిగాడు. ఒక యువకుడు గ్రామీణ కళలను ప్రపంచానికి పరిచయం చేయగలిగాడు. కెమెరా, ఇంటర్నెట్ ఉంటే చాలు.. ఎవరైనా సృష్టికర్తగా మారే అవకాశాన్ని ఈ వేదిక కల్పించింది.

కానీ ప్రతి విప్లవానికి ఒక చీకటి కోణం కూడా ఉంటుంది. యూట్యూబ్ అల్గారిథమ్ ప్రేక్షకుల దృష్టిని ఎక్కువసేపు నిలబెట్టే కంటెంట్‌ను ముందుకు నెడుతోంది. దాంతో సమాచారం కంటే సంచలనం, సృజనాత్మకత కంటే సానుభూతి, వాస్తవం కంటే నాటకీయత ఎక్కువ వ్యూస్ తెస్తున్నాయన్నది పచ్చి నిజం. ఈ మానసిక బలహీనతను కొందరు వ్యాపార అవకాశంగా మలుచుకుంటున్నారు. ఒకప్పుడు ట్రావెల్ వ్లాగ్ చేసిన చానల్, క్రమంగా 'మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది' అనే వీడియోలు చేయడం ప్రారంభిస్తోంది. వంట వీడియోలు చేసిన కుటుంబం, అకస్మాత్తుగా అప్పులు, అనారోగ్యం, ఇంటి కష్టాలు, కుటుంబ గొడవలు, పిల్లల కన్నీళ్లు వంటి అంశాలను ప్రధాన కంటెంట్‌గా మార్చేస్తోంది. కొన్ని చానళ్లలో ప్రతి రెండు వారాలకు ఒక 'ఎమర్జెన్సీ' వస్తూనే ఉంటుంది. 'ఇది మా చివరి వీడియో', 'చానల్ మూసేయాల్సి వస్తోంది', 'మీరు ఆదుకోకపోతే అంతే', 'మా పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది' అనే శీర్షికలు ప్రేక్షకుడి మనసుపై మానసిక ఒత్తిడిని సృష్టిస్తున్నాయి.

"ఇది సహాయం కోరడం కాదు.. భావోద్వేగాన్ని మార్కెట్ చేయడం."

ఇటీవలి కాలంలో అనేక దేశాల్లో ఇలాంటి ధోరణులు చర్చకు వచ్చాయి. కొంతమంది యూట్యూబర్లు వైద్య ఖర్చుల పేరుతో విరాళాలు సేకరించి, తర్వాత ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. మరికొందరు విలాసవంతమైన జీవితం గడుపుతూ, వీడియోల్లో మాత్రం తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నట్లు చూపించి విమర్శలకు గురయ్యారు. పాశ్చాత్య దేశాల్లో ఫ్యామిలీ వ్లాగింగ్ పేరుతో పిల్లల వ్యక్తిగత జీవితాన్ని కూడా ఆదాయ వనరుగా మార్చడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. పిల్లల ఏడుపు, కుటుంబ కలహాలు, వ్యక్తిగత విషాదాలు.. ఇవి అన్నీ కంటెంట్‌గా మారాయి. ప్రేక్షకుల కన్నీళ్లు ప్రకటనల ఆదాయంగా మారాయి. మన దేశంలో కూడా పరిస్థితి భిన్నంగా లేదు. ఒక ప్రమాదం జరిగినా, అనారోగ్యం వచ్చినా, కుటుంబ సమస్య వచ్చినా ముందుగా ఆసుపత్రికి వెళ్లే ముందు కెమెరా ఆన్ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మా జీవితంలో ఇదే పెద్ద విషాదం.. అనే శీర్షికతో గంటల కొద్దీ వీడియోలు విడుదల అవుతున్నాయి. ఆ వీడియో చివర్లో యూపీఐ నంబర్, బ్యాంక్ ఖాతా, మెంబర్‌షిప్ లింక్ తప్పకుండా కనిపిస్తాయి. బాధ నిజమే కావచ్చు. కానీ బాధను ప్యాకేజింగ్ చేసి ఆదాయంగా మార్చడం నైతిక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఇక్కడ మరో ప్రమాదం ఉంది. అదే.. వీక్షకుడి మనస్తత్వం. సహజంగానే ఎవరైనా కష్టాల్లో ఉన్నారని భావిస్తే సాయం చేయాలనుకుంటాం. అది మానవత్వం. కానీ ఆ మానవత్వాన్ని పదేపదే వ్యాపార వ్యూహంగా ఉపయోగిస్తే, ఒక దశ తర్వాత ప్రజలు నిజమైన బాధను కూడా అనుమానంతో చూడటం ప్రారంభిస్తారు. ఇది కూడా మరో యూట్యూబ్ డ్రామానేనా? అనే సందేహం పెరుగుతుంది. దాంతో నిజంగా సహాయం అవసరమైన వారు కూడా నష్టపోతారు. సోషల్ మీడియా మానసిక శాస్త్రం కూడా దీనికి కారణమే. 'పారాసోషల్ రిలేషన్‌షిప్' అనే భావన ప్రకారం ప్రేక్షకుడు ఒక క్రియేటర్‌ను తన కుటుంబ సభ్యుడిలా భావించడం ప్రారంభిస్తాడు. అతన్ని వ్యక్తిగతంగా కలవకపోయినా, ప్రతిరోజూ వీడియోలు చూస్తూ భావోద్వేగ బంధం ఏర్పరుచుకుంటాడు. ఈ బంధం విశ్వాసంగా మారుతుంది. అదే విశ్వాసం ఆర్థిక సహాయంగా మారుతుంది. ఈ మానసిక అనుబంధాన్ని కొందరు బాధ్యతగా ఉపయోగిస్తే, మరికొందరు వ్యాపార సాధనంగా ఉపయోగిస్తున్నారు.

ఇంకో ఆందోళనకర ధోరణి ఏంటంటే.. వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా అమ్ముకోవడం. ఒకప్పుడు కళ, విజ్ఞానం, ప్రయాణం, వంట, విద్య వంటి అంశాలు కంటెంట్‌గా ఉండేవి. ఇప్పుడు పెళ్లి గొడవలు, అత్తా-కోడళ్ల తగాదాలు, పిల్లల మార్కులు, కుటుంబ రహస్యాలు, ఆసుపత్రి బెడ్‌పై చికిత్స, అంత్యక్రియలు కూడా వీడియోలుగా మారుతున్నాయి. ఒక మనిషి జీవితంలోని అత్యంత వ్యక్తిగత క్షణాలు ఇప్పుడు థంబ్‌నెయిల్‌లుగా మారుతున్నాయి. జీవితం కంటెంట్‌ను సృష్టిస్తుందా? లేక కంటెంట్ కోసం జీవితాన్నే సృష్టిస్తున్నామా? అన్నదే డౌట్. ఇది కేవలం యూట్యూబ్‌కే పరిమితమైన సమస్య కాదు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, షార్ట్ వీడియో ప్లాట్‌ఫారమ్‌లలో కూడా ఇదే సంస్కృతి పెరుగుతోంది. బాధను చూపితే వ్యూస్ వస్తాయి. కన్నీళ్లు చూపితే కామెంట్లు వస్తాయి. సంక్షోభాన్ని చూపితే డొనేషన్లు వస్తాయి. ఈ సమీకరణ క్రమంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఒక మోడల్‌గా మారుతోంది. అయితే అందరు క్రియేటర్లను ఒకేలా చూడటం అన్యాయం. వేల మంది యూట్యూబర్లు నిష్పక్షపాతంగా సమాచారం అందిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉచితంగా బోధిస్తున్నారు. వైద్యులు ఆరోగ్య అవగాహన కల్పిస్తున్నారు. రైతులు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. శాస్త్రవేత్తలు క్లిష్టమైన అంశాలను సులభంగా వివరిస్తున్నారు. చరిత్ర, భాష, సంస్కృతి, సాంకేతిక విజ్ఞానం, కళలను ప్రజలకు చేరువ చేస్తున్న అనేక మంది నిజాయతీ గల సృష్టికర్తలు ఉన్నారు. వారి వల్లే ఈ వేదిక విశ్వసనీయత ఇంకా నిలిచి ఉంది. అందుకే సమస్య యూట్యూబ్ కాదు. సమస్య కొందరు ఎంచుకున్న వ్యాపార నమూనా. ప్రేక్షకులు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. ఒక వీడియో చూసి వెంటనే భావోద్వేగానికి లోనవ్వడం కంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. ఈ వ్యక్తి ఎప్పుడూ ఇలాంటి వీడియోలే చేస్తున్నాడా? ఆర్థిక సహాయం ఎందుకు అవసరమైంది? దానికి ఆధారాలు ఉన్నాయా? ఇదివరకు కూడా ఇలాగే పదేపదే విరాళాలు అడిగాడా? నిజంగా సహాయం అవసరమా? లేక ఇది మరో మార్కెటింగ్ వ్యూహమా? విమర్శనాత్మక ఆలోచన డిజిటల్ యుగంలో అత్యవసర నైపుణ్యం.

యూట్యూబ్ వంటి వేదికలు కూడా మరింత పారదర్శక విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత విరాళాల సేకరణకు స్పష్టమైన మార్గదర్శకాలు, ఆర్థిక పారదర్శకత, మోసపూరిత భావోద్వేగ ప్రచారాలపై కఠిన చర్యలు, పిల్లలను ఆదాయ సాధనంగా ఉపయోగించే కంటెంట్‌పై కఠిన నియంత్రణ వంటి అంశాలు సమయానుకూలంగా పరిశీలించాలి. ప్రేక్షకుడి విశ్వాసం ఒక కరెన్సీ కాదు. అది ఒక బాధ్యత. ఒకసారి కోల్పోతే తిరిగి సంపాదించడం అత్యంత కష్టం. వ్యూస్, లైక్స్, సూపర్ థ్యాంక్స్, మెంబర్‌షిప్‌లు అన్నీ మళ్లీ రావచ్చు. కానీ విశ్వాసం పగిలితే అది తిరిగి అతుక్కోవడం చాలా కష్టం. యూట్యూబ్ ఒక సాంకేతిక వేదిక మాత్రమే. అది మంచిదా చెడ్డదా అనేది దాన్ని ఉపయోగించే మనుషులపై ఆధారపడి ఉంటుంది. కెమెరా అబద్ధం చెప్పదు. కానీ కెమెరా ముందు నిలిచే మనిషి ఏ కథ చెబుతున్నాడన్నదే సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. కంటెంట్‌కు విలువ ఉండాలి. సృజనాత్మకతకు గౌరవం ఉండాలి. సహాయం అవసరమైతే అడగడంలో తప్పు లేదు. కానీ సానుభూతి శాశ్వత ఆదాయ వనరుగా, ప్రేక్షకుల విశ్వాసం వ్యాపార వ్యూహంగా, కన్నీళ్లను మానిటైజేషన్ సాధనంగా మార్చడం మాత్రం అత్యంత ప్రమాదకరం.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.